అయోధ్య అక్షింతల పంపిణీ



వివిధ ప్రాంతాల ఆలయాల వారికి అక్షింతలు అందిస్తున్న రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: అయోధ్యలో పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం లంగర్‌హౌస్ త్రివేణి సంగం వీరవెంకట విజయ రాఘవ స్వామి ఆలయంలో నిర్వహించారు. అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలకు పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రామభక్తుల కోసం సీతా రామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. రాజేంద్రనగర్, గండిపేట, గోల్కొండ మండలాల్లో వివిధ ప్రాంతాల ఆలయాలకు ఇక్కడి నుంచి అక్షింతల కలశాలు అందజేశారు. రామనామస్మరణతో అక్షింతలు తలపై మోసి మంగళవాయిద్యాలు, డప్పులతో ఊరేగింపుగా ఆయా ప్రాంతాల ఆలయాలకు అక్షింతలను తీసుకెళ్లారు.

అయ్యప్ప స్వాములకు సౌకర్యాలు కల్పించాలి



పూజలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, రమేష్ గురుస్వామి తదితరులు

అబిడ్స్: అయ్యప్ప స్వాములకు కేరళలో సకల సౌకర్యాలు కల్పించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎస్.ధన్‌రాజ్, రమేష్ గురుస్వామి డిమాండ్ చేశారు. గౌలిగూడలో జరిగిన అయ్యప్ప మహా పడిపూజలో వారు పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు కేరళ ప్రభుత్వంతో సంప్రదించి అయ్యప్ప భక్తుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నవీన్ గురుస్వామి, శేఖర్ గురుస్వామి, రాజారామ్ ఉపాధ్యాయ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభినందనలు



హాష్మిని అభినందిస్తున్న కోచ్ హబీబ్ ముస్తఫా

చార్మినార్: మహారాష్ట్రలో ఈనెల 29న జరిగిన 67వ నేషనల్ స్కూల్ గేమ్ 2023లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొన్న పాతబస్తీ విద్యార్థి సయ్యద్ అహద్ అహ్మద్ హాష్మి బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. 2830 కిలోల బరువు విభాగంలో పాతబస్తీ జహనుమాకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఈ విజయం సాధించడంతో హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీ కోచ్ హబీబ్ ముస్తఫా శనివారం అభినందించి సత్కరించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న సమితి ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి 22వ ఆవిర్భావ దినోత్సవాలు శనివారం హనుమాన్ టెక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సమితి జెండాను వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బేడ బుడగ జంగాల అభివృద్ధికి కోసం తమ సమితి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మంతప్ప, చైర్మన్ శ్రీనివాస్‌లు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.నర్సింహ, అధికార ప్రతినిధి శేఖర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీరప్ప, రాష్ట్ర నాయకులు దస్తగిరి, దుర్గమ్మ, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రతినిత్యం అన్నదానం



అన్నదానం చేస్తున్న మహ్మద్ బషీర్ తదితరులు

గోల్కొండ: అన్నదానానికి కులమతాలు ఉండవని ప్రముఖ సంఘ సేవకుడు గోల్కొండ ప్రభుత్వ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. శనివారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రి, సరోజిదేవి కంటి ఆసుపత్రి, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో ఇన్ పేషంట్ల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహృదయులైన కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు, వ్యాపారులు, యువకులు నిరంతరం కొనసాగే ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలుగా ఉంటున్నారన్నారు. 654 రోజులుగా నిరంతరం అన్నదానం చేస్తున్నామని, ప్రతినిత్యం 200 భోజన ప్యాకెట్లు అందిస్తున్నామని ఒకొక్క భోజన ప్యాకెట్‌లో ఇద్దరు వ్యక్తులు కడుపునిండా తినవచ్చునని ఆయన పేర్కొన్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ బలోపేతం



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకుడు ఉస్మాన్ బిల్ మహ్మద్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ రోజురోజుకూ బలోపేతం అవుతుందని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గ నాయకుడు ఉస్మాన్ బిల్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. శనివారం కార్వాన్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపడుతుందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరచడం ప్రారంభించిందని ఆయన అన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు



మాట్లాడుతున్న డీసీపీ బాలస్వామి

నాంపల్లి: నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు తప్పవని సౌత్ వెస్ట్ డీసీపీ బాలస్వామి బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులను హెచ్చరించారు. ఎక్కడా డ్రగ్స్ విక్రయించరాదని సూచించారు. అలా ఎవరైన డ్రగ్స్ విక్రయిస్తే జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లోని ఏకే ఫంక్షన్ హాల్‌లో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. డిసెంబరు 31న రాత్రి 12 గంటలకు వైన్స్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలని కోరారు. యువకులు మితిమీరిన వేగంతో వాహనాలను నడుపవద్దని పేర్కొన్నారు. తాగి రోడ్లపైకి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడిషనల్ డీసీపీ అశ్వాక్, ఏసీపీలు రాజా వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఫరూఖ్, జావీద్, జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



గోషామహల్‌లో.. డిప్యూటీ కమిషనర్ బాలయ్య, స్పెషల్ ఆఫీసర్ గీతారాధిక



ఒవైసీ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన డీసీపీ బాలస్వామి



చుడిబజార్‌లో.. కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్ ముదిరాజ్ తదితరులు



గోల్కొండలో ప్రజా పాలన సభ కేంద్రంలో ఎమ్మెల్యే కౌసర్

మూడవ రోజూ అదే జోరు..

- ముమ్మరంగా కొనసాగుతున్న 'ప్రజా పాలన'
- కేంద్రాల వద్ద బారులుతీరిన జనం
- పోలీసుల భారీ బందోబస్తు



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజా పాలన 3వ రోజు జోరుగా కొనసాగింది. చుడిబజార్, బేగంబజార్, జాంబాగ్, అబిడ్స్ గోషామహల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.

దరఖాస్తుదారులకు అన్ని ఏర్పాట్లు..

దరఖాస్తుదారులకు అన్ని ఏర్పాట్లు చేశామని 14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్ గీతా రాధికతో కలిసి చుడిబజార్, గోషామహల్ ప్రాంతాల్లోన్ని పలు ప్రజా పాలన కేంద్రాలను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ..అందరు దరఖాస్తు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రజల వద్దకే పాలన...

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన ప్రారంభించిందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర మాజీ పీసీసీ కార్యదర్శి వినయ్‌కుమార్ ముదిరాజ్ పేర్కొన్నారు. చుడిబజార్ ప్రాంతంలో దరఖాస్తుదారులకు సహాయ సహకారాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్కరి రేషన్‌కార్డు అందించలేదని గుర్తు చేశారు.

దరఖాస్తులు అమ్ముకునే వారిపై కఠిన చర్యలు..

గోల్కొండ: ప్రజా పాలన సభకు వచ్చిన వారందరికీ దరఖాస్తు ఫారాలు ఉచితంగా అందించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్, గోల్కొండ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని ప్రజా పాలన సభ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న అధికారులు, వివిధ పార్టీల నాయకులతో మాట్లాడారు. దరఖాస్తు ఫారాలను వచ్చిన వారికి ఉచితంగా అందించాలని దరఖాస్తులు అమ్ముకున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్ ఫారాన్, అలీముద్దీన్, సయ్యద్ సిద్దిఖ్ తదితరులున్నారు.

అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి..

ప్రజా పాలన సభ కేంద్రాల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. దరఖాస్తు ఫారాలు బ్లాక్‌లో అమ్ముడవుతున్నాయన్న విషయం తెలుసుకొని ఆయన కార్వాన్‌లోని పలు ప్రజా పాలన సభ కేంద్రాలను సందర్శించారు. పేదల కోసం ప్రజా పాలన కేంద్రాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రారంభించారన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికి దరఖాస్తు ఫారాలు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రం అధికారిపై ఉందని ఆయన పేర్కొన్నారు. బ్లాక్‌లో దరఖాస్తులు అమ్ముతున్నారన్న విషయం తెలిసినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలి..

అర్హులందరూ ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అమ్జద్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండలోని ఒవైసీ కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఎంతో మేలు చేస్తుందని అస్మర్‌ఖాన్ అనే యువకుడు ఆయనను కలిసి తాను దరఖాస్తుకు సంబంధించిన రసీదును చూపించారు.



గోల్కొండ ఒవైసీ కమ్యూనిటీహాల్ కేంద్రంలో..



అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ



జాంబాగ్‌లో హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన లడ్డూ సుభాష్



బహదూర్‌పురా నియోజకవర్గంలో..



జెడ్సీకి ఫిర్యాదు చేస్తున్న రఘుపాల్‌రెడ్డి, చంటిబాబు

దరఖాస్తులు విక్రయిస్తే కఠిన చర్యలు..

నాంపల్లి: దరఖాస్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సౌత్ వెస్ట్ డీసీపీ బాలస్వామి దళారులను హెచ్చరించారు. దరఖాస్తులు విక్రయిస్తున్నట్లుగా తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని సూచించారు. శనివారం హబీబ్‌నగర్‌లోని ఒవైసీ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన ఆయన మాట్లాడారు. ప్రజా పాలన వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘర్షణలు, గొడవలు జరుకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌బాగ్‌లో..

బహదూర్‌పురా: కిషన్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యే మహ్మద్ మోబీన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. దరఖాస్తులను పూర్తి చేయడం, పలు వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేటర్ హుస్సేనీ పాషాతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

బహదూర్‌పురా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని ప్రజా పాలన దరఖాస్తు కేంద్రాలను శనివా రం బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ అభయహస్తం స్కీమ్ స్పెషల్ ఆఫీసర్ సునంద, ఫలక్‌నుమా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్యలతో కలిసి పరిశీలించారు. ప్రజలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని రాజేశ్ కుమార్ అధికారులను కోరారు.

ప్రజాపాలన కేంద్రాన్ని స్థానికంగానే ఏర్పాటు చేయాలి..

లంగర్‌హౌస్: ప్రజా పాలన కేంద్రం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి రఘుపాల్‌రెడ్డి, చంటి బాబు అన్నారు. ఇబ్రంహీంబాగ్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని బాపూనగర్‌కు తరలించాలని కోరుతూ శనివారం జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హమీద్, సంతోష్ గౌడ్, శ్రీకాంత్, సయ్యద్ అలీం ఉన్నారు.

సిటీ సివిల్ కోర్టులో 2410 కేసుల పరిష్కారం



యాకుత్‌పురా: లోక్ అదాలత్‌లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా సూచించారు. శనివారం పురానిహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో జాతీయా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 9 బెంచీలను ఏర్పాటు చేసి కోర్టులో పెండింగ్‌లో ఉన్న 893 కేసులతో పాటు 1517ప్రీ లిటిగేషన్‌లకు చెందిన మొత్తం 2410 కేసులను పరిష్కారించి బాధితులకు రూ. 61,59,02,503 ల నష్టపరిహారాన్ని నిర్ణయించామని ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ..చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా సత్వరమే పరిష్కారించేందుకు న్యాయ శాఖ లోక్ అదాలత్‌ను అందుబాటులోకి తీసుకోచిందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు చీఫ్ జడ్జిలు డానీ రుత్, ఉదయ్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి భవానీ, సిటీ సివిల్ కోర్టు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జూనియర్ సివిల్ జడ్జి జి.కళార్చన పాల్గొన్నారు.

కోఠి ఈఎన్‌టీలో అరుదైన శస్త్ర చికిత్స

సుల్తాన్‌బజార్: పదేళ్ల క్రితం పురుగుల మందు తాగి మాట పోగొట్టుకున్న ఓ రోగికి కోఠి ఈఎన్‌టీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి మాటలు తెప్పించారు. కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం కనిపర్తికి చెందిన రాము(29) 12 ఏళ్ల క్రితం పురుగుల మందు తాగాడు. అతని కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అతనికి మత్తు వైద్యులు త్వరగా కోలుకోవడానికి శ్వాసనాళంలో గొట్టం వేసి వెంటిలేటర్ అమర్చి నాలుగు నుంచి ఆరు వారాల పాటు చికిత్స అందించారు. తర్వాత రోగి కోలుకుని డిశ్చార్జ్ అయి వెళ్లిపోయాడు. కానీ రెండు మూడు నెలల తర్వాత రోగికి శ్వాస తీసుకోవడంలో సమస్య తలెత్తింది. అప్పుడు వరంగల్ జిల్లాలోని ఎంజీఎం ఆసుపత్రిలో చూపించుకోగా వైద్యులు పరీక్షలు నిర్వహించి శ్వాసనాళంలో రంధ్రం చేయడం ద్వారా పేషంట్‌కు ఆక్సిజన్‌ను అందించి ప్రాణాలను కాపాడారు. గొంతులో ట్రేకియాస్టమి ట్యూబ్ ఉండడం వల్ల గాలి తీసుకోగలుగుతున్నాడు కానీ మాటలు రావడం లేదు. పదేళ్ల తర్వాత రోగి తిరిగి కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రికి రావడంతో వైద్యులు పరీక్షించి డ్యూమాన్ స్టంట్‌ను సీఎం రిలీఫ్ ద్వారా తెప్పించి శ్వాసనాళం అమర్చి, చెవిలోని మృదులాస్థిని గొంతు దగ్గర చేసిన రంధ్రంలో ఉంచడం ద్వారా ఆ రంధ్రాన్ని మూసివేసి సాధారణ స్థితిలో మాట్లాడే విధంగా శస్త్ర చికిత్స చేశారు. ఈ అరుదైన ఆపరేషన్‌లో పాల్గొన్న వైద్యులు డాక్టర్ ఆనందాచార్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంపత్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ ఫణిభూషన్, డాక్టర్ స్వామి, మత్తు డాక్టర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాప్రదీపా, నిఖిల పాల్గొన్నారు.

పోక్సో చట్టం కింద యువకుడి అరెస్ట్

అబిడ్స్: స్నేహం పేరుతో అమ్మాయిని మభ్యపెట్టి బలత్కారం చేసిన యువకుడిని గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్‌కు చెందిన ఆర్.చందు (22) గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న బాలిక(16)తో స్నేహం ఏర్పడింది. అమ్మాయితో చనువుగా ఉంటున్న చందు దీన్ని అవకాశంగా తీసుకుని బాలికపై అఘాయిత్యం చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చెత్తను తొలగించండి



హనుమాన్ ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్త

చార్మినార్: హైకోర్టు గేట్ నెంబర్-7 చంపా దర్వాజ వద్ద ఉన్న హనుమాన్ ఆలయ ప్రధాన రోడ్డుపై వారం రోజులుగా పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి టి.రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతూ జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.


ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు



విజయనగర్‌కాలనీలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈటెక్నో పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి చిన్నారులు ఒకరికి ఒకరు తినిపించుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యావేత్త జీఎం.గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ నౌషీర్ ఖాతూన్ పాల్గొన్నారు.

అయోధ్య రామ మందిర అంక్షితల ఊరేగింపు



డబీర్‌పురా: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని డబీర్‌పురా బోధేఅలీషా కిడికిలోని పోచమ్మ ఆలయానికి చేరుకున్నాయి. అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అంక్షితలను కాలిబర్ దర్బార్ మైసమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి రామ కీర్తనలు, రాముడి పాటలు, భక్తి గీతాలను ఆలపిస్తూ డబీర్‌పురా కట్టెలగూడ మీదుగా నూర్‌ఖాన్‌బజార్ మీదుగా డబీర్‌పురా బోదేఅలీషా కిడికిలోని పోచమ్మ ఆలయానికి చేరుకున్నాయి.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



చాంద్రాయణగుట్ట: స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ తరుణ్ నాయక్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో పొందిన విద్యార్థులు జడ్చర్లలోని ఏఆర్ స్పోర్ట్స్ మార్షియల్ అకాడమీలో జరిగిన కరాటే కుమిటే పోటీలలో విద్యార్థులు సత్తా చాటారు. సాయి నివేదిత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు సాయి కార్తీకేయ గోల్డ్ మెడల్ సాధించగా.. హేమచరణ్ కాంస్య, శ్రద్ధ గోల్డ్ మెడల్, 9వ తరగతికి చెందిన సాయి ప్రణవ్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ హరిహర ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లలిత కుమారీ విద్యార్థులను అభినందించారు.

నగర బీసీలకు పీసీసీ పదవి ఇవ్వండి



మాట్లాడుతున్న సత్తి ప్రకాష్‌రెడ్డి

అబిడ్స్: హైదరాబాద్ నగరానికి చెందిన బీసీలకే పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ లీగల్ హ్యూమన్‌రైట్స్, ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది సత్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. నగరం తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయలాంటిదన్నారు. హైదరాబాద్‌కు చెందిన బీసీ వ్యక్తులకు పీసీసీ పదవితో పాటు మంత్రి పదవి అప్పగిస్తే బీసీలకు తగు న్యాయం జరుగుతుందన్నారు. శనివారం తన కార్యాలయంలో సత్తి ప్రకాష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జు ఖార్గే, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ నగర బీసీలకు పీసీసీతో పాటు ఒక మంత్రి పదవిని ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు షౌకత్, రఫీక్, గోషామహల్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ ఠాకూర్ పాల్గొన్నారు.

యాదవ హైర్ ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: యాదవ హైర్ కులస్తులకు ఆత్మగౌవర భవనాన్ని నిర్మించాలని రాష్ట్ర పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. గత పదేళ్లల్లో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ యాదవ హైర్ సమాజ్‌ను పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తమ కులస్తుల భవనానికి స్థలాన్ని కేటాయించి భవనం నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌యాదవ్, జయదీప్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్, మహేందర్‌యాదవ్, బల్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



దివ్యాంగులను సన్మానిస్తున్న బల్మూరి సుమన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, భారత జాగృతి అధ్యక్షుడు బల్మూరి సుమన్ రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో దివ్యాంగుల సేవా సంఘం 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దివ్యాంగులు అన్ని రంగాల్లో విజయాలు సాధించవచ్చన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు దివ్యాంగులను ఘనంగా సన్మానించారు. మాజీ కార్పొరేటర్ బోడ అనయి డిన్నా, ఫిర్జాదిగూడ కార్పొరేటర్ పోచయ్య, దివ్యాంగుల సేవా సంఘం నిర్వాహకులు మహేష్ పాల్గొన్నారు.

నియామకం



తిరుపతి శివకుమార్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్వర్ రావు తదితరులు

గౌలిపురా: కర్మన్‌ఘట్ మున్నూరు కాపు సంఘం (రాచెరుకట్ట) ట్రస్టు బోర్డు సభ్యుడిగా పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు తిరుపతి శివ కుమార్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తిరుపతి శివ కుమార్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అలంకరించి కులాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. మున్నూరుకాపు మహాసభ ఉపాధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్, మున్నూరు కాపు మాసపత్రిక ఎడిటర్ కందికట్ల భాస్కర్, కోశాధికారి బిళ్లకంటి రవికాంత్ రావు, మహాసభ కార్యవర్గ సభ్యులు సప్పిడి శ్రీనివాస్ రావు, గడేకర్ల (గద్వాల్) సత్యనారాయణ, పాతనగర మున్నూరు కాపు సంఘం కోశాధికారి పొన్న బాలరాజ్ పాల్గొన్నారు.